చెరువులకు చేపపిల్లలు చేరేనా?

- ఈ ఏడాది ఇంకా ప్రారంభం కాని ఉచిత సీడ్ పంపిణీ
- గతేడాది ఈ సమయానికే టెండర్ ప్రక్రియ పూర్తి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



గతేడాది పెబ్బేర్ మండలంలోని పాతపల్లి చెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు, నాయకులు(ఫైల్)

పెబ్బేరు రూరల్: వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలో పెద్ద చెరువులతో పాటు శ్రీరంగ సముద్రం రిజర్వాయర్ ఉన్నాయి. వీటిలో గత సంవత్సరంలో పలు రకాల చేపపిల్లల సీడ్‌ను వదిలారు. వనపర్తి మండలంలో 66 చెరువులు ఉండగా.. 12.94 లక్షల చేపప్లిలలను వదిలాలరు. శ్రీరంగాపురం మండలంలో 28 చెరువులు ఉండగా.. 11.32 లక్షల చేపపిల్లలు వదిలారు. పెబ్బేరు మండలంలో 84 చెరువులు ఉండగా.. 15.62 లక్షల చేప పిల్లలను వదిలారు. వీటిలో కట్ల, రాహు, బంగారు తీగ, మృగాల వంటి నాలుగు రకాల చేప పిల్లల సీడ్‌ను మూడు మండలాల్లో మొత్తం 39.28 లక్షల చేప పిల్లలను వదిలారు. ఇందుకు సంబంధించి అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెలల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించగా.. జిల్లా మత్స్యశాఖ అధికారులు జూన్ మొదటి వారంలో పూర్తి చేశారు. టెండరు పొందిన తెలంగాణ, ఆంధ్రకు చెందిన కాంట్రాక్టర్‌కు సీడ్ సరఫరా బాధ్యతలను అప్పగించారు. గతేడాది వర్షాలు ఆలస్యంగా రావడంతో సెప్టెంబర్‌లో చేపపిల్లల పంపిణీ ప్రారంభించి ఆ నెలాఖరు వరకు పూర్తిచేశారు. ఈ ఏడాది ఉచిత చేపపిల్లల సీడ్ పంపిణీ ఉంటుందా లేదా అని మత్స్యకారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంపిణీ ఉంటుందో లేదో తెలియజేయకపోవడంతో మత్స్యకారుల సంఘాలు అయోమయంలో పడ్డాయి. అయితే జిల్లా స్థాయిలో సీడ్ సరఫరాకు జూన్ రెండో వారంలోనే టెండర్లు ప్రక్రియ ముగుస్తుంది. కానీ ఈసారి జూన్ నెల ముగింపు దశకు చేరుకుంటున్నా టెండర్లపై జిల్లా మత్స్య శాఖలో ఎలాంటి కదలిక లేదు. ఫలితంగా ఈ సారి చేపపిల్లలు చెరువుకు చేరడం అనుమానమేనని మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసి తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

చేపపిల్లలు పంపిణీ చేయాలి..

గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను పంపిణీ చేయాలి. త్వరగా టెండర్లను పూర్తిచేసి చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలి. – వెంకటస్వామి, మత్స్యకారుడు, శ్రీరంగాపురం

నీటి నిల్వలు లేకపోవడంతో..

గతేడాదిలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తిచేశాం. ఈ సారి వర్షాలు ఆలస్యం రావడంతో చెరువుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో ఆలస్యమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టెండరు ప్రక్రియ ప్రారంభమైంది. త్వరగా పూర్తి చేస్తాం.
– లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి విరాళం



మదనాపురం: మండలంలోని దుప్పల్లి ఆంజనేయస్వామి ఆలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి గ్రామ ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యజమానులు సోమవారం రూ.10 వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. వీటిని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తకోట రూరల్: కొత్తకోట మండంలోని వివిధ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పూర్తి చేసుకున్న వివిధ పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొనేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటలకు వడ్డెవాట తండా బీటీ రోడ్డు ప్రారంభం, 11 గంటలకు సత్యహళ్లీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం, 12 గంటలకు అమడబాకుల–బూత్కూర్ గ్రామాల మధ్యన నూతనంగా నిర్మించిన బ్రిడ్జి ప్రారంభం, అదేవిధంగా అమడబాకులలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పర్యటను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాల శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు లేక బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు నిలిచి చిత్తడిగా మారడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల వద్ద రోడ్డు వెంట వీధి లైట్లు లేవని, వర్షాకాలంలో విషపురుగులు సంచరిస్తూన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో సీసీ రహదారులు లేక, వీధిలైట్లు లేవని, నీటి సమస్య ఉందని, కనీస సౌకర్యాలు కల్పించకుండా బాధితులకు అప్పగించారని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంతర్గత రోడ్లను, ప్రధాన రహదారిని సీసీగా మార్చాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యపై అధికారుల పర్యవేక్షణ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్లలో 20 రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సోమవారం మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి సోమవారం గ్రామంలో పర్యటించారు. పుర్గర్‌చర్లలో నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో తాగునీటి పైపులైన్‌లో అంతరాయం ఏర్పడిందని, త్వరలోనే ఆ సమస్యలు పరిష్కరించి గ్రామంలోని అన్ని కాలనీలకు తాగునీరు అందేలా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌గౌడ్, గ్రామస్తులు అకిల్, నర్సింహ, ఎల్లస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కొత్తకోట విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14న పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించగా.. కొత్తకోట నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పథకాలు సాధించినట్లు కోచ్ శివశంకర్, పరశురాంలు తెలిపారు. ఈ పోటీల్లో 8 మంది విద్యార్థులు గోల్డ్, ముగ్గురు సిల్వార్, ఇద్దరు బ్రౌన్ పథకాలను సాధించడంతో పాటు ఈ నెల 22, 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. పథకాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సీనియర్ కరాటే మాస్టర్లు పెంటన్నయాదవ్, నరేందర్‌సాగర్, శీనుయాదవ్, నరేష్ నాయుడు, రమేష్‌రెడ్డి, శివయ్యాలు అభినందించారు.

‘జీఓ నంబర్ 10ని రద్దు చేయాలి’



వనపర్తి జిల్లా కేంద్రంలో ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

పెబ్బేరు రూరల్: గత ప్రభుత్వంలో విడుదల చేసిన జీఓ నం 10ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పాలిటెక్నిక్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు వెళ్లి గేటు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పీఏ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడారు. జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష పారితోషికం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ ఒప్పందాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నందిమల్ల రాములు, డి.కురుమయ్య, మద్దిలేటి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాధా, వెంకటేశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన



వనపర్తి లా కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్వర్లు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణం లోని ఎస్‌డీఎం లా కళాశాలలో సోమవారం ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా లీగల్ బ్యూరో జాయింట్ కార్యదర్శి డాక్టర్ రాం ప్రసాద్, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా పాలమూరు విశ్వవిద్యాలయం వారు పాల్గొని మాట్లాడారు. వారు కళాశాలలో తిరుగుతూ.. విద్యార్థుల సౌకర్యాలను అన్నింటిని పరిశీలించారు. కళాశాలలోని వసతులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజుల్లో కాలేజీ పేరు ప్రతిష్టలు వచ్చేలా మీరు కష్టపడి చదివి, వచ్చే విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ



కంచిరావుపల్లిలో బీజేపీ నాయకుడిని పరామర్శిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, శ్రీరంగాపురం బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామితో కలిసి సోమవారం గ్రామంలో వెంకట్రామరెడ్డిని పరామర్శించారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు ఫోన్‌లో పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి ..



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో మల్లెల బాలస్వామి మృతి చెందిన విషయాన్ని ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బొంబాయి మన్నెంకొండ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలియజేయడంతో సోమవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ బాలస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పి, ఎమ్మెల్యే అందించిన రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో చిట్యాల నరేందర్, కురుమూర్తి, వెంకటేష్, నరేందర్, తిరుపతయ్య, గోపాల్, నారాయణ తదితరులు ఉన్నారు.

ఎడతెరపి లేని వర్షం



పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట వర్షపు నీరు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల మైదానాలు కొద్దిపాటి వర్షాలకే వర్షపు నీటితో నిండిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆదివారం రాత్రి, సోమవారం రెండు రోజుల పాటు కురుస్తున్న వర్షాలకు పాఠశాల మైదానాల్లో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారాయి. పాఠశాలల గదుల్లోకి వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారడంతో పాటు ఆటలు కూడా ఆడలేని పరిస్థితి నెలకొంది. ఆయా పాఠశాలల మైదానాలు లోతట్టుగా ఉండటం, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో వర్షాలు వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు మైదానంలో నిల్వ లేకుండా సాఫీగా బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

మండలంలో 38.02 మిల్లీమీటర్ల నమోదు

పాన్‌గల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 38.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎస్‌ఓ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ వర్షంతో మెట్ట పంటలకు జీవంతో పాటు వరినాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఒక పక్క చిరు జల్లులు కురుస్తుండటం మరో పక్క దట్టమైన మేఘాలు ఖిల్లా గట్టును కమ్మేయడంతో గుట్ట మొత్తం ఆకాశం మాదిరిగా కనిపించి కనువిందు చేసింది. ఖిల్లా గట్టును మేఘాలు కమ్మేసిన దృశ్యాలను గ్రామస్తులు ఆశ్చర్యంగా తిలకించారు.



పాన్‌గల్ ఖిల్లా గట్టును కమ్మేసిన మేఘాలు

ఆత్మకూర్: వాన జోరందుకుంది. భారీ వర్షం ఎడతెరపి లేకుండా కురియడంతో అంతా అతలాకుతలంగా మారింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి దాకా వాన దంచికొట్టింది. దీంతో డ్రెయినేజీలు నిండి పారాయి. వర్షం నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా పాత నివాసగృహాల్లో ఉండకూడదని, సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్ విన్నవించుకున్నారు. వర్షం కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఆత్మకూర్‌లో అంధకారం నెలకొంది. అలాగే రోడ్లపై వర్షం నీరు చేరి గుంతలమయంగా మారాయి. అన్ని వార్డుల్లో పరిస్థితి ఇలాగే ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షం నీరు భారీగా చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అమరచింతలో జోరు వాన



అమరచింతలో కురుస్తున్న వర్షం

అమరచింత: మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం దంచికొట్టింది. ఎడతెరపి లేని వర్షం కారణంగా ప్రజలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొహర్రం వేడుకలు ప్రారంభం కావడంతో భక్తులు మసీదులకు వెళ్లి ఆలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు జడివానలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో మెట్టపంటల రైతులకు ఊరట కలిగించిన, చిరు వ్యాపారులకు నిరాశ కలిగించింది.

కాల్వ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు, రైతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సమీపంలో కేఎల్ఐ డీ–1 కాల్వను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం ఇరిగేషన్ శాఖ అధికారులకు గిరిజన సంఘం నాయకులు, తండా రైతులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు, రైతులు మాట్లాడారు. కాల్వ పూడ్చి వారం రోజులు గడుస్తున్నా.. నేటికి అధికారులు బాధ్యులైన రైతుపై చర్యలు తీసుకోవడంలో జాప్యం తగదన్నారు. గతంలో ఫిర్యాదు చేసినా.. స్పందించకపోవడంతో మరోమారు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. కాల్వ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సంబంధిత రైతుపై చర్యలు తీసుకుని, సాగునీరు సాఫీగా చివరి ఆయకట్టుకు అందేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు మాట్లాడారు. ఇప్పటికే పూడ్చిన కాల్వను ఏఈ పరిశీలించారని మరోమారు పరిశీలించి సంబంధిత రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాల్యానాయక్, రాజునాయక్, రవినాయక్, శంకర్‌నాయక్, రవి, రమేష్‌నాయక్, బాబునాయక్, ధర్మనాయక్ రైతులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్



బీజేవైఎం నాయకులను అరెస్టు చేసిన కొత్తకోట పోలీసులు



ఆత్మకూర్‌లో అరెస్టయిన బీజేవైఎం నాయకులు

కొత్తకోట రూరల్: డీఎస్సీ వాయిదా వేయాలని నిరసిస్తూ సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర బీజేవైఎం పిలుపు ఇవ్వడంతో సోమవారం తెల్లవారుజామున కొత్తకోట పోలీసులు బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు విద్యార్థి ఉద్యమాలను ఆపలేరన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో నిరంతరం విద్యార్థుల పక్షాన నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడుతామన్నారు. అరెస్టయిన వారిలో మహేష్, కురుమూర్తి, సందీప్, రాజశేఖర్, రవి ఉన్నారు.

బీజేవైఎం నాయకుల అరెస్ట్

ఆత్మకూర్: నిరుద్యోగులకు మద్దతుగా చేపట్టబోయే కార్యక్రమానికి బయలుదేరిన బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రూప్– 2, డీఎస్సీ పరీక్షలు నిర్వహించడంతో నిరుద్యోగులకు నష్టం వాటిల్లుతుందని, పరీక్షలు వాయిదా వేయాలని సోమవారం డిమాండ్ చేశారు. అరెస్ట్ అయినవారిలో నాయకులు ఆనంద్, శ్యాం, బాలు, అంజి, కృష్ణ, వెంకటేష్, శివ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎస్ఎఫ్ఐ నాయకులు

వీపనగండ్ల: విద్యా, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సచివాలయ ముట్టడి కార్యక్రమ పిలుపును దృష్టిలో ఉంచుకొని మండలంలోని పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలియజేసే వారిని అదుపులోకి తీసుకోవడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పోలీసుల అదుపులో ఉన్నవారిలో దామోదర్, శేఖర్, అశోక్, రాకేష్, సహదేవుడు ఉన్నారు.

బైక్‌లో చెలరేగిన మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొత్తకోట రూరల్: బైక్‌పై అతివేగంగా వెళ్తుండగా.. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో బైక్ పూర్తిగా దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన సాయినాథ్ తన అపాచి బైక్(టీఎస్ 08 హెచ్‌పీ 3139)పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. వర్షం కారణంగా రేయిన్‌కోర్టు, రేయిన్ ప్యాంట్ వేసుకున్నాడు. సోమవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెళ్లి ఎన్‌హెచ్ 44పైకి రాగానే బైక్‌కు సంబంధించిన సైలెన్సర్ వేడి అయి రేయిన్‌ప్యాంట్ కాలపోయింది. దాంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సాయినాథ్ వెంటనే బైక్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చే లోపు బైక్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలియజేశారు.

గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలి



పెబ్బేరులో ఏఈకి వినతి అందజేస్తున్న రైతులు

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా సరిగా లేదని రైతులు, గ్రామాల ప్రజలు సోమవారం పెబ్బేరులోని విద్యుత్ ఏఈ అఖిలేష్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో కొద్ది రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సబ్‌స్టేషన్ నుంచి గుమ్మడానికి సపరేట్ లైన్ ద్వారా 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని కోరారు. గుమ్మడం లింక్ లేకుండా యాపర్ల గ్రామానికి వెళ్లే 11 కేవీ లైన్‌ను సపరేట్ వేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఆంజనేయులు, కురుమన్న, చందు, శ్రీనివాసులు రఘు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్ కల్పించాలి



పెబ్బేరులో విలేకరులతో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

పెబ్బేరు రూరల్: తెలంగాణలోని గౌడ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి గౌడ సంఘం నాయకులు, గీతకార్మికుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం గౌడ సంఘం మండల నాయకులు విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికుల శ్రేయస్సు కోసం కాటమయ్య రక్షణ కవచం పథకం ప్రవేశపెట్టారు. ప్రభుత్వ భూముల్లో, వెంచర్ల రోడ్ల వెంట ఈత, తాటివనం నాటడానికి అనుమతి ఇస్తామని తెలిపారు. 1996లో గౌడ కులస్తులకు 961 జీఓ ప్రకారం ఈత వనం పెట్టుకోవడానికి గ్రామానికి 5 ఎకరాల భూమి, రూ.5 లక్షలు ఇచ్చి చెట్లను పెంచుకోవడానికి అవకాశం కల్పించే వారని అన్నారు. గత ప్రభుత్వం గౌడ కులస్తులకు వైన్‌షాపులో 15 శాతం రిజర్వేషన్ కల్పించింది. ఈ ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ గౌడ కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్ గౌడ్, సురేందర్ గౌడ్, బస్వరాజు గౌడ్, రాముస్‌గౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, వెంకటన్నగౌడ్ పాల్గొన్నారు.

మూలమళ్లలో మొసళ్ల కలకలం



ఆత్మకూర్ మండలంలోని మూలమళ్ల చెరువుకట్టపై సంచరిస్తున్న మొసళ్లు

ఆత్మకూర్: మండల పరిధిలోని మూలమళ్లలో మొసళ్ల సంచారం కలకలం రేపుతోంది. దీంతో గ్రామస్తులు భయాందోళనలో గడుపుతున్నారు. గ్రామ శివారులోని చెరువుకట్టమీద ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో మూడు మొసళ్లు ఉండడంతో అటుగా వస్తున్న గ్రామస్తులు చూసి పరుగులు పెట్టారు. అనంతరం అక్కడికి చేరుకున్న గ్రామస్తులు కేకలు వేయడంతో ఆ మూడు మొసళ్లు చెరువులోకి వెళ్లిపోయాయి.

ఫారెస్టు అధికారులు స్పందించాలి...

మూలమల్లలో మొసల్ల సంచారం అధికమైందని ఇప్పటికే మనుషులు, పశువులపై దాడులకు తెగబడ్డాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మూలమల్ల చెరువుతో పాటు, దిగువ జూరాల బ్యాక్‌వాటర్‌లో, ప్రధాన ఎడుమ కాల్వ, సమాంతర కాల్వల్లో వందల సంఖ్యలో మొసళ్లు ఉన్నాయని, ఈ మధ్యకాలంలో గొర్లకాపరిపై దాడి చేయడంతో పూర్తిగా కాలును కోల్పోయాడని గుర్తుచేశారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి ఫారెస్టు అధికారులను గ్రామానికి పంపించి తమ ప్రాణాలు కాపాడాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం చెరువుకట్టపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద్‌గౌడ్, ఖాజపాష, శ్రీనివాసులు, లక్ష్మన్న, వెంకటన్న, జీవరత్నం, రాకేష్ తదితరులు ఉన్నారు.